రాజోల్‌లో భూభారతి భూ రీసర్వే

కంగ్టి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండల పరిధిలోని రాసోల్ గ్రామంలో గురువారం భూభారతి భూ రీసర్వే గ్రామ సభను నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సబ్ కలెక్టర్ ఉమాహారతి హాజరై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ భూ రికార్డులను ఆధునీకరించేందుకు, కచ్చితత్వాన్ని పెంచడం కోసం, సరిహద్దు వివాదాలను పరిష్కరించేందుకు, యజమాని హక్కులను స్పష్టం చేయడం, భూమి కొలతలను సరిచేయడం, ఆధునిక సాంకేతికతల పరికరాలతో డిజిటల్ రికార్డులను రూపొందించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్, సర్వే టీం, రెవిన్యూ సిబ్బంది బిక్షపతి, షేక్ ఆహ్మద్, అబ్దుల్ ముఖ్ని, సర్పంచి రోజవ్వ యేసు, పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వర్ పటేల్, ఎంఈఓ రహిమోద్దిన్, ఖిపాయత్ అలీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన అధికారులు

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
తల్లిదండ్రులు మందలించారని బాలుడు ఇంట్లో నుండి బయటకొచ్చి తప్పిపోగా ఆ బాలుని తిరిగి అధికారులు తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన ఇది. పూర్తి వివరాలిలా ఉన్నాయి. బీహార్‌లోని ముజఫాపూర్ ప్రాంతానికి చెందిన దంపతులు కుమారుడితో కలిసి జీవనోపాధి కోసం సిద్దిపేట మండలం తడకపల్లి సమీపంలోని ఓ కోళ్లఫారంలో పనిచేస్తున్నారు. మూడురోజుల క్రితం తల్లి మందలించిందని ఇంట్లో నుంచి బయటకు వచ్చిన బాలుడు సిద్దిపేటలో రైలు ఎక్కి గజ్వేల్‌లో దిగాడు. గమనించిన రైల్వే సిబ్బంది, ప్రయాణికులు చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వడంతో బాబును చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు బాలల సంక్షేమ సమితి ముందుకు తీసుకురావడం ద్వారా వారు సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడంతో పూర్తి వివరాలు సేకరించి, బాలుని తల్లిదండ్రులను పిలిపించి విచారణ చేసి బాలుని వారికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి ఇంచార్జ్ చైర్‌పర్సన్ దేశబోయిని నర్సింహులు, సభ్యులు డి.అంజమ్మ, ఎస్.మంజుల, చైల్డ్ లైన్ ప్రతినిధి వినోద తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపి, మున్సిపల్ చైర్మన్

కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సురేష్‌కుమార్‌శెట్కార్, నాగేష్‌శెట్కార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
ఢిల్లీలోని కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరి కార్యాలయంలో జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్‌శెట్కార్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే 161(బి) నిజాంపేట్ - నారాయణఖేడ్ మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు 520 కోట్ల నిధులు మంజూరుచేసి పనులు కొనసాగుతున్న విషయంపై మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, కర్ణాటక బోర్డర్ నుండి బీదర్ వరకు మిగిలిన 8 కిలోమీటర్ల రహదారికి కూడా నిధులు మంజూరు చేసి, 161(బి) హైవేతో అనుసంధానం చేయాలని విజ్ఞప్తిచేశారు. ఇక నూతన నారాయణఖేడ్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కేంద్రం నుండి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ అంశాలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణకు అడ్డంకులు తొలగించాలి

-కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్‌కు పార్టీ శ్రేణుల విన్నపం

కేంద్రమంత్రి బండి సంజయ్‌కు విన్నవిస్తున్న పార్టీ శ్రేణులు

కోహెడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండలపరిధిలోని చెంచెల్ చెర్వుపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ చేయకుండా అధికారులు పెడుతున్న ఇబ్బందులను బిజెపి శ్రేణులు గురువారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి వివరించారు. చెంచెల్ చెర్వుపల్లి గ్రామంలో పార్టీలకు అతీతంగా ఆరె క్షత్రియులు మెయిన్ రోడ్డుపై ఎలాంటి అటంకాలు లేకుండా శివాజీ విగ్రహం ఏర్పాటుచేసి జయంతి రోజు విగ్రహావిష్కరణ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నామని వివరించారు. 2013 ఫిబ్రవరి 18 సుప్రీం కోర్టు గైడెలెన్స్‌ను ఒక్క ఛత్రపతి శివాజీ విగ్రహాల మీద అధికారులు విగ్రహావిష్కరణ చేయకుండా అడ్డుకొని నోటీసులు పంపిస్తున్నారని తెలిపారు. ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ విషయాలపై తెలియజేసి విగ్రహావిష్కరణ కార్యక్రమం చేయించాలని కోరారు. ఈవిషయంలో అధికారులు అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని అధికారులను బండి సంజయ్ కోరినట్లు తెలిపారు. విగ్రహావిష్కరణలో అధికారులు మొండిగా వ్యవహరిస్తే తానే సిసిపల్లికి వచ్చి ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ చేస్తానని భరోసా ఇచ్చినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వెంకటేశం, బిజెపి మండల అధ్యక్షులు జాలిగం రమేష్, సర్పంచ్‌లు పకీడే సంపత్, కాతం అమూల్య రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచి మ్యాకాల చంద్రశేఖర్‌రెడ్డి, వార్డుసభ్యులు కట్ట ప్రవీణ్, పార్టీ నాయకులు తిమ్మాపురం శ్రీనివాస్, ఆరె క్షత్రియసంఘం అధ్యక్షులు కొల్లూరు పెంటయ్య, గౌరవాధ్యక్షులు ఒజ్జపల్లి శ్రీనివాస్, నాయకులు కందిగాయ చందర్‌రావ్, చీమలపాటి శ్రీకాంత్, ఆరె క్షత్రియ కులసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి

-మెదక్ జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమాసింగ్

కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ టౌన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. నూతన కలెక్టర్ కలెక్టరేట్‌కు చేరుకోగానే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, మెదక్ ఆర్డీవో రమాదేవి ఘనస్వాగతం పలికారు. గురువారం మెదక్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌కు జిల్లా అధికారులు జిల్లా అధికారులు పూలమొక్కలతో స్వాగతం పలికి మర్యాదగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల గురించి డిఈఓను, ఇంటర్ విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పి సిఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ భుజంగరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గర్భవిచ్ఛిన్న మాత్రల అక్రమవిక్రయాలపై పోలీసుల నిఘా...!

వార్త ప్రభావం

-కట్టుదిట్టమైన విచారణకు ఆదేశించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
హుస్నాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా గర్భవిచ్ఛిన్న మాత్రల అక్రమ విక్రయాలపై ప్రభాతవార్తలో హుస్నాబాద్‌లో గర్భవిచ్ఛిత్తి మాత్రల అక్రమ వ్యాపారం, మెడికల్ షాపులకే కాదు ఆర్ఎంపిలు, ప్రైవేట్ ల్యాబ్‌లకూ విస్తరణ అనే శీర్షికలతో ఇటీవల వార్తలో ప్రచురితం కాగా, ఈ అక్రమవిక్రయాలపై సిద్దిపేట పోలీసులు కఠిన చర్యలకు దిగారు. పట్టణం లోనూ, పట్టణ పరిసర ప్రాంతాల్లోనూ మెడికల్ షాపులు, ఆర్ఎంపిలు, కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌ల ద్వారా నిబంధనలు ఉల్లంఘిస్తూ గర్భవిచ్ఛిన్న మాత్రలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈనేపథ్యంలో పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ గురువారం సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించి, అక్రమవిక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని డ్రగ్ ఇన్స్పెక్టర్లు, సిసిఎస్, టాస్క్ ఫోర్స్ సిబ్బందితో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు సమాచారం. ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భవిచ్ఛిన్న మాత్రలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, మహిళల ఆరోగ్యంతో చెలగాటం ఆడేవారిపై చట్టపరమైన కేసులు నమోదుచేసి, లైసెన్సులు రద్దుచేసే దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈవిషయంలో పోలీసులు ఇప్పటికే హుస్నాబాద్‌లోని అనుమానాస్పద మెడికల్‌షాపుల జాబితాను సిద్ధం చేసి, రహస్యంగా నిఘా కొనసాగిస్తున్నారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు కూడా అక్రమ విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళల ఆరోగ్యం, భద్రతకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పోలీస్‌శాఖ ఈ సందర్భంగా స్పష్టంచేస్తోంది.

బడ్జెట్ ప్రవేశపెట్టిన మున్సిపల్ చైర్మన్

-ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ హైమావతి

మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
సిద్దిపేట మున్సిపాలిటీ 2026-2027 సంవత్సరానికి సంబంధించిన 181.99 కోట్ల అంచనాల బడ్జెట్‌ను మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజుల మున్సిపల్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ కె.హైమావతి ముఖ్య అతిథిగా హాజరైన సమావేశంలో ప్రవేశపెట్టగా పాలకవర్గం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్ వెంకట్‌రావు పాలకవర్గం సభ్యుల సమక్షలో బడ్జెట్ ప్రసంగంచేశారు. మొత్తం అంచనావేసిన ఆదాయం 2026-27 సంవత్సరానికిగానూ రూ.181కోట్ల99లక్షల50వేలు కాగా, ఆర్థికసంవత్సరానికి చేయబోయే అంచనా వ్యయం రూ.181కోట్ల93లక్షలు కాగా, మిగులు వ్యయం రూ.6.10లక్షలు మొత్తం సాధారణ ఆదాయం 52.96కోట్లుగా కేటాయించారు. సాధారణ వ్యయంలో 1/3వంతు వెనుకబడిన, మురికి వాడల, గ్రామాలలో మౌలికవసతుల అభివృద్ధికి రూ.2.73 కోట్లు కేటాయించారు. సాధారణ బడ్జెట్‌లో 10శాతం హరిత బడ్జెట్‌కు రూ. 5.29 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ.. సిద్దిపేట మున్సిపాలిటీ ఇంత మంచి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందులకు చైర్మన్‌తో పాటు పాలకవర్గం సభ్యులకు, అధికారులకు అభినందనలు తెలిపారు. బడ్జెట్ ఆమోదం నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించనున్నట్లు తెలిపారు. 2026-27 సంవత్సరానికిగానూ బడ్జెట్ అంచనాలను ప్రతిపాదించడం జరిగిందన్నారు. మున్సిపల్ చైర్మన్ మంజుల మాట్లాడుతూ.. వార్షిక బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సహాయ సహకారాలతో మున్సిపాలిటీని అన్ని రంగాలల్లో ఆదర్శంగా నిలుపడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషన్ సిద్ది అశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి మంచిపేరు తీసుకురావడంలో తాను ఎప్పుడూ ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కనకరాజు, పాలకవర్గం సభ్యులు, డిఈ ప్రేరణపాండా, ఏఈలు, మేనేజర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రతాభావాన్ని పెంపొందించేందుకే ఫ్లాగ్ మార్చ్

-సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సిపి రష్మి పెరుమాల్

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాయుధ పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజలకు మేమున్నాం అని భరోసా కల్పించాలన్నదే ఈ ఫ్లాగ్‌మార్చ్ ఉద్దేశమన్నారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లినప్పుడు ప్రజలకు రక్షణగా పోలీస్‌బలగాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. కేంద్ర సాయుధబలగాలు ప్రాదేశిక ప్రాంతాలను అవగాహన చేసుకోవడానికి ఈ ఫ్లాగ్‌మార్చ్ ఉపయోగపడుతుందని, అవసరమైనప్పుడు త్వరితగతిన స్పందించేందుకు కేంద్రబలగాలు ఎప్పటికీ అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎసిపి సౌదారపు సదానందం, సిఐ కోండ్ర శ్రీనివాస్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

టోల్ గేట్ వద్ద మృత్యువుకు ఆహ్వానం!

టోల్ గేట్ వద్ద రోడ్డు మీద నిలిపిన భారీ వాహనాల దృశ్యం

గుమ్మడిదల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
గుమ్మడిదల టోల్ గేట్ వద్ద రాత్రి వేళ కనిపిస్తున్న దృశ్యం ఎవరి హృదయాన్నైనా కలచివేసేలా ఉంది. రహదారికి మధ్యలో ఇరువైపులా వరుసగా నిలిపిన లారీలు, బస్సులు, భారీ వాహనాలు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం ఏ క్షణంలోనైనా పెను విషాదంగా మారే ప్రమాదం పొంచి ఉంది. చీకటి వేళల్లో సరైన వీధి దీపాలు లేకుండా, హెచ్చరిక బోర్డులు పెట్టకుండానే వాహనాలను రోడ్డుమీదే నిలిపివేయడం ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనం. వేగంగా వచ్చే వాహనదారులకు అకస్మాత్తుగా ఎదురయ్యే ఈ అడ్డంకులు బ్రేక్ వేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ప్రమాదాలకు దారితీస్తున్నాయి.

ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు, పేద ప్రయాణికులు, ఉద్యోగానికి వెళ్లే కార్మికులు ప్రతిరోజూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఈ మార్గంలో ప్రయాణించాల్సి వస్తోంది. ఇక్కడ ఎప్పుడెప్పుడు ఎవరి ప్రాణం పోతుందో తెలియదు అని స్థానికులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. టోల్ గేట్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, రహదారిశాఖ అధికారులు ఈ ప్రమాదకర పరిస్థితిని చూసీచూడనట్లు వ్యవహరించడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ఏదైనా ఘోర ప్రమాదం జరిగితేనే కళ్లు తెరుచుకుంటాయా? అప్పటివరకు ఎంతమంది ప్రాణాలు పోవాలి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే రోడ్డు మధ్యలో వాహనాల నిలుపుదలపై సంపూర్ణ నిషేధం విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే డ్రైవర్లపై కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే గుమ్మడిదల టోల్ గేట్ ప్రమాదాల కేంద్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేలుకొని చర్యలు తీసుకోవాలని, ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

-మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ హైమావతి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా కలెక్టర్ కె.హైమావతి మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనానికి వండిన వంటకాలను ఆమె పరిశీలించారు. వంటకాల నాణ్యతను మరింత మెరుగు పర్చాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనం వండాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. కామన్ డైట్ మెనూ పాటిస్తూ విద్యార్థుల హాజరు ప్రకారం వంట సరుకులు, కూరగాయలు, ప్రతిదాన్ని పర్యవేక్షణ చేస్తూ, అందరికీ భోజనం సరిపోయేలా చూసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. స్టోర్ రూమ్‌లో సరుకులకు తనిఖీ చేసి భద్రంగా స్టోర్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజన ప్రక్రియలో నాణ్యత లోపించడంతో కళాశాల వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వంటను నాణ్యతగా వండాలని ఇష్టానుసారంగా వండితే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ఆదర్శపాఠశాల బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ హైమావతి సందర్శించారు.

అనుమానస్పద స్థితిలో వివాహిత మృతి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
అనుమానస్పద స్థితిలో వివాహిత మహిళ మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన చిన్నశంకరంపేటలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివారాల ప్రకారం... శ్రీలత(30), జాల సునిల్ దంపతులు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో శ్రీలత ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ నారాయణగౌడ్, రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కూతురిమృతిపై అనుమానం వ్యక్తంచేస్తూ సిద్దయ్య పోలీసులకు ఫిర్యాదుచేయగా, కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, శ్రీలత మృతికిగల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 వాహనాల సీజ్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాల సీజ్

కోహెడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండలపరిధిలోని మోయతుమ్మెదవాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా 5 బొలెరో వాహనాలలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా కోహెడ పోలీసులు గురువారం పట్టుకొని సీజ్‌చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు టిఎస్36-టిఎ-3516, టిఎస్36-టి-2367,టిఎస్36-టి0-533, టిఎస్36-టి-2812, టిఎస్36-టి-3153 బొలెరో వాహనాలలో గీకరు అజయ్, గర్రెపల్లి శ్రావణ్, ద్యాగటి సాగర్, గర్రెపల్లి సాయితేజలు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. ఈసందర్భంగా ఎస్ఐ అభిలాష్ మాట్లాడుతూ ఎవరైనా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణాచేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

చేర్యాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ఎస్సై అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అర్జునపట్ల వాగులోంచి 3 ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో వాటిని స్వాధీనంచేసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మందుబాబుల అడ్డాగా మారిన కుందన్‌వానిపల్లి పల్లె ప్రకృతివనం

అక్కన్నపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
అక్కన్నపేట మండలంలోని కుందన్‌వానిపల్లి గ్రామంలో ఉన్న పల్లె ప్రకృతి వనం ప్రస్తుతం మందుబాబుల అడ్డాగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలు విశ్రాంతి కోసం, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ వనం తన అసలు లక్ష్యాన్ని కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోందని వారు చెబుతున్నారు. వనంలో ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ బాటిళ్లు ఎక్కడికక్కడ పడేసి ఉండటంతో పరిసరాలు తీవ్రంగా కలుషితమయ్యాయి. చెట్లకు సమయానికి నీరు అందకపోవడంతో పలుచోట్ల మొక్కలు ఎండిపోతున్నాయి. పిచ్చిమొక్కలు విస్తరించి వనం చిన్నపాటి అడవిని తలపించేలా మారిందని, పల్లె ప్రకృతి వనం ఇప్పుడు భయాందోళనలకు కారణమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో మందుబాబుల రాకపోకలు పెరగడంతో మహిళలు, పిల్లలు అక్కడికి వెళ్లేందుకు సంకోచిస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వనంలో శుభ్రతచర్యలు చేపట్టాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని, చెట్లకు నీటిసౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అదే విధంగా వనంలో పర్యవేక్షణ పెంచి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమ ఇసుక నిల్వలు జప్తు

-30 ఇసుక కుప్పలు సీజ్
-అదుపులోకి గాడిదలు

ఇసుక లోడుతో ఉన్న గాడిదలు స్వాధీనం

పావన్నపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
అక్రమంగా మంజీరానది నుంచి గాడిదల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారని పత్రికలలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం పోలీసులు.. రెవిన్యూ అధికారులు ఉమ్మడిగా గాజులగూడెం, చిత్రియాల్, ఎంకెపల్లి గ్రామాల శివారులోని మంజీరాతీరంలో ఇసుకను తరలిస్తున్న, గాడిదల యజమానులను అదుపులోకి తీసుకొని, నిల్వ ఉంచిన 30 ఇసుక కుప్పలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా పావన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, మంజీరానది నుంచి తట్టెడు ఇసుక తీసినా, మైనింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రవాణాచేస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని వ్యాపారులకు తెలిపారు. ఎవరైనా ఇసుక తీస్తే ఫోన్ ద్వారా సమాచారం అందివ్వాలని సూచించారు. ఇసుక రవాణా కోసం, ఇతర మండలాల నుండి వచ్చిన గాడిదల యజమానులు తను స్వస్థలాలకు తిరిగి వెళ్ళాలని సూచించారు. మూడు గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులను, ట్రాక్టర్ యజమానులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. జాయింట్ ఆపరేషన్లో ఆర్ఐ స్వామి, జిపిఓ, పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటాం : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల కాలనీల సమస్యలపై ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావును కలిసిన సంక్షేమ సంఘాల నాయకులు.

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం తమ మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం గాయత్రినగర్ డివిజన్‌కు సంబంధించిన అన్ని సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. బస్తీల కాలనీలలో డ్రైనేజీ సమస్యలు, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి కొరత, పారుశుధ్య సమస్యలు వంటి అంశాలను సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ గౌసుద్దీన్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం, జాహేద్ షరీఫ్, జావేదుద్దీన్, కృష్ణారావు, బొల్లు శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, శ్రీనివాసరెడ్డి, ధనరాజ్, మల్లేష్, అంకిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మౌనిక హంతకులను కఠినంగా శిక్షించాలి

జగద్గిరిగుట్టలో కోవత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో చాకలి కుటుంబానికి చెందిన వారు గుడిలోకి వచ్చి ఇచ్చిన డబ్బులకు రసీదు అడిగితే మమ్మలనే అడుగుతారా అని చెప్పి దాడి చేసి 2 నెలల పాప మౌనిక మరణానికి కారణమయ్యారని, దానికి కారణమైన ముఖ్యమైన వారిని నేటి వరకు అరెస్ట్ చెయ్యకపోవడం దారుణమని రజక సంఘం నాయకులు విట్టల్ అన్నారు. కుల దూరహంకారంతో రెచ్చిపోవడం అనగరికమని, రేవంత్ రెడ్డి బీసీ బంధువు అని చెప్పి ప్రగల్భాలు పల్కడం తప్ప నిజం కాదని దానిని నిరూపించుకోవాలంటే వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రజక సంఘం నాయకులు విట్టల్ నాయకత్వం వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీనియర్ నాయకులు ఏసురత్నం, రజక సంఘం నాయకులు భాస్కర్, నాగరాజు, చంద్రిమౌళి, సత్యనారాయణ, రాజు, శ్రీనివాస్ సతీష్ మండల సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబులు పాల్గొన్నారు.

సంజీవ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

ధ్వజస్తంభనాకి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త 125 గాజులరామారం డివిజన్ పి.పి.నగర్‌లో నూతనంగా నిర్మించిన సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభన కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలను తొలగిస్తూ అభయానిచ్చే దైవం ఆంజనేయస్వామి ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలన్నారు. దేవాలయ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయడానికి కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్ రావు, పి.శ్రీనివాస్ రెడ్డి, చంద్రకాంత్, వివేక్, వెంకట్ రెడ్డి, భీమేశ్వర్ రావు, బాబా, నాయుడుస్ శ్రవణ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇమ్రాన్ బేగ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, మూసా ఖాన్, చెట్ల వెంకటేష్, దూలప్ప, ఆంజనేయులు, బోయిని మహేష్, రాములు గౌడ్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, దండుగుల నవీన్, శ్రవణ్, సయ్యద్ రంజాన్, ప్రసాద్, శివా నాయక్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సన్మానం

భరత్ ప్రసాద్ దూబేని, వారి సతీమణి రాణిబాయి దూబేలను సన్మానిస్తున్న కౌన్సిల్ సభ్యులు

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: ఎస్సార్ నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గత వారం నిర్వహించిన మూడు రోజుల ఆధ్యాత్మిక విహార యాత్ర విజయవంతంగా పూర్తయింది. ఈ యాత్రకు అధ్యక్షులు భరత్ ప్రసాద్ దూబే పూర్తి సహకారం అందిస్తూ, యాత్రికులకు సమగ్ర మార్గని ర్దేశనం చేసి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. యాత్ర సాఫల్యాన్ని పురస్కరించుకుని కౌన్సిల్ సభ్యులు భరత్ ప్రసాద్ దూబేని, వారి సతీమణి రాణిబాయి దూబే దంపతులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ యాత్రను చక్కగా సమన్వయం చేసి అందరికీ స్ఫూర్తిని చ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కోదండ రామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి సమేత కోదండరామ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత నాలుగు రోజులుగా ఆలయ ప్రాంగణంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. గురువారం ఉదయం నుండి ఆలయ ప్రాంగణంలో వేద పారాయణం కలశారాధనలు ద్వారా తోరణా ధ్వజ కుంభ ఆరాధనలు కలన్యాస హోమం ప్రాణాది దశ వాయున్యాస హోమం ఘర్తనాప్యం రత్న స్థాపన యంత్రస్థాపన తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం శ్రీ కోదండ రామస్వామి, ఆంజనేయస్వామి, గణపతి స్వామి, శివలింగ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. సాయంత్రం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ, కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, హర్షణపల్లి దామోదర్ రావు, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముషీరాబాద్‌లో ముందస్తు సందడి

-బాస్‌ల మెప్పు కోసం గన్‌మెన్‌లుగా మారుతున్న నేతలు!

చిక్కడపల్లి ఫిబ్రవరి 26 (ప్రభాతవార్త) : జిహెచ్ఎంసి ఎన్నికల నగారా ఇంకా మోగకముందే, ముషీరాబాద్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. డివిజన్ ల వారీగా ప్రధాన పార్టీల నేతలు టికెట్ వేటలో పడ్డారు. ముఖ్యంగా అధికార ప్రతిపక్షాల మధ్య పోటీ కంటే, పార్టీలో అంతర్గతంగా టికెట్ దక్కించుకోవడానికి జరుగుతున్న పోటీ ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఇందులో ముందువరుసలో బిఆర్ఎస్ శ్రేణులున్నారు. బిఆర్ఎస్ పార్టీలో టికెట్ ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. స్థానిక శాసనసభ్యుడు ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జయసింహ చుట్టూ ఇప్పుడు ఆశావహుల సందడి కనిపిస్తోంది. తండ్రీ కొడుకులిద్దరూ నియోజకవర్గంలో ఏ చిన్న కార్యక్రమానికి వెళ్లినా, పెళ్లిళ్లకు హాజరైనా వారి వెంటే ఉంటూ తమ భక్తిని చాటుకుంటున్నారు అనుచరులు. ఈ పోటీ ఎంతలా ఉందంటే, ముఠా గోపాల్‌ను ప్రసన్నం చేసుకునే క్రమంలో కొందరు నేతలు తమ హోదాను కూడా మరిచి పోతున్నారు. ఎమ్మెల్యే వెంటే ఉంటూ వారికి రక్షణగా వ్యవహరించడం, అధికారిక గన్‌మెన్ల కంటే యాక్టివ్‌గా ఉంటూ జనాలను పక్కకు నెట్టడం, ఎమ్మెల్యే కారు దిగగానే చుట్టూ భద్రతా వలయంలా ఏర్పడటం, ఒక రకంగా చెప్పాలంటే, అసలైన గన్‌మెన్లకు పనే లేకుండా ఆశావహులే ఆ బాధ్యతను భుజానికెత్తుకుంటున్నారు. "బాస్ కంట పడితేనే కదా.. రేపు సీటు సంగతి తేలేది" అన్న చందంగా వారి తీరు ఉంది.వార్డుల విభజన, రిజర్వేషన్లు ఎలా ఉన్నా, ముందుగా అధిష్టానం వద్ద మార్కులు కొట్టేయాలని ఆశావహులు భావిస్తున్నారు. అందుకే ఎమ్మెల్యే ప్రోగ్రాం ఏదైనా సరే, అక్కడ వందమంది అనుచరులతో ప్రత్యక్షమై తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. ముషీరాబాద్‌లోని అన్ని డివిజన్ల నుంచి ఇదే తరహా పోటీ కనిపిస్తుండటంతో, రాబోయే రోజుల్లో ఈ ఖిమెప్పుఖి పొందే కార్యక్రమాలు ఇంకా ఎన్ని వింత పోకడలకు దారి తీస్తాయో చూడాలి. రాబోయే ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవాలంటే కేవలం ప్రజాబలం ఉంటే సరిపోదు, అధినాయకత్వం దృష్టిలో పడటం కూడా ముఖ్యమని ఆశావహులు భావిస్తున్నారు. అందుకే ఏ కార్యక్రమం జరిగినా వందలాది మంది అనుచరులతో హాజరై తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. రిజర్వేషన్ల లెక్కలు ఇంకా తేలకముందే, ముందస్తుగా తమ ఉనికిని చాటుకోవడానికి ఈ విధేయత రాజకీయ్యం తప్పనిసరి అని విశ్లేషకులు భావిస్తున్నారు.

నీడలా వెన్నాడుతూ..

ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఉదయం నివాసం నుంచి బయటకు వచ్చిన సమయం నుండి, తిరిగి రాత్రి ఇంటికి వెళ్లే వరకు ఆశావహులు ఆయనను నీడలా వెన్నాడుతున్నారు. ఆయన నియోజకవర్గంలో ఏ గల్లీకి వెళ్లినా, ఏ చిన్న కార్యక్రమంలో పాల్గొన్నా తమ ఉనికిని చాటుకోవడానికి పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే కంటపడితేనే భవిష్యత్తు ఉంటుందన్న ఆరాటంతో సొంత పనులను సైతం పక్కన పెట్టి మరీ ఖిముఠాఖి సేవలో తరిస్తున్నారు.

విధేయత చాటుకునేందుకు పాట్లు!

ఎమ్మెల్యే కార్యక్రమాలకు వెళ్లినప్పుడు ఆయనకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవడం, జనాన్ని నియంత్రించడం, ప్రోటోకాల్‌తో సంబంధం లేకుండా అతిగా స్పందించడం వంటివి ఇప్పుడు నియోజకవర్గంలో చర్చకు దారితీస్తున్నాయి. ఎమ్మెల్యే కారు దిగకముందే డోర్ తీయడం దగ్గర నుండి, ఆయన వెంట నడుస్తూ "మేమున్నాం అని చాటుకోవడం వరకు ప్రతి విషయంలోనూ నేతల మధ్య పోటీ నెలకొంది. ఈ అతి విధేయతను చూసి సామాన్య కార్యకర్తలు ముక్కున వేలేసుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రసన్న రాజకీయాలు ఏ తీరానికి చేరుతాయో చూడాలి.

ముషీరాబాద్ గులాబీ కోటలో.. ఉద్యమ కెరటాల హోరు!

కార్పొరేటర్ల బరిలో మేం సిద్ధం..

ముఠా జైసింహాకు ఉద్యమకారుల విన్నపం

చిక్కడపల్లి ఫిబ్రవరి 26 (ప్రభాతవార్త) : తెలంగాణ మలిదశ ఉద్యమ సెగల్లో కాలి, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ముషీరాబాద్ ఉద్యమకారులు ఇప్పుడు ప్రజాక్షేత్రంలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి తమకు కార్పొరేటర్లుగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఉద్యమకారుల దండు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తనయుడు, యువనేత ముఠా జైసింహాను కోరింది. గురువారం భారీ సంఖ్యలో తరలివచ్చిన ఉద్యమకారులు జైసింహాను మర్యాదపూర్వకంగా కలిసి, తమ మనోగతాన్ని వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ భావోద్వేగాన్ని ప్రకటిస్తూ.. "నాడు స్వరాష్ట్ర సాధన కోసం లాఠీ దెబ్బలు తిని, జైలు గోడల మధ్య నలిగిన చరిత్ర మాది. పదవుల కోసం కాకుండా, ప్రజల సేవ కోసం నిరంతరం శ్రమిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన ఉద్యమకారులకు ఈసారి టికెట్లు ఇస్తే, పార్టీ విజయకేతనం ఎగురవేయడం ఖాయం." తమ విన్నపాన్ని

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తనయుడు, యువనేత ముఠా జైసింహాను కలిసిన తెలంగాణ ఉద్యమకారులు

పార్టీ అధిష్టానం మరియు ముఖ్య నాయకుల దృష్టికి తీసుకెళ్లి, ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించి న్యాయం చేయాలని వారు ముఠా జైసింహాను వేడుకున్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యమకారుల సేవలను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సీనియర్ ఉద్యమకారులు కల్వ గోపి, రేషం మల్లేష్, అజయ్ ముదిరాజ్, సిరిగిరి శ్యామ్, నేత శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, బిక్షపతి, జోగేందర్, వేణు యాదవ్, బాలరాజ్, దేవయ్య, చంద్రశేఖర్ యాదవ్, వంశీ చింతకింది, మందుల నరసయ్య, విట్టల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పసిపాప మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి : సీఐటియూ

హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: నాగర్‌కర్నాల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల పసిపాపను కాళ్లతో తన్ని, పాప మృతికి కారణమైన అగ్రకుల పెత్తందారులను కఠినంగా శిక్షించాలని సీఐటియూ నగర ఉపాధ్యక్షులు జి.రాములు డిమాండ్ చేశారు. గురువారం గోల్నాక లేబర్ అడ్డాలో సిఐటియూ అంబర్‌పేట్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరై రాములు మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్రం వచ్చి, 75 సంవత్సరాలు పూర్తి అయినపనపటికీ, ఇంకా దేశంలో కుల వివక్ష, అంటరానితనం విలయతాండవం చేస్తున్నాయని అన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక, ఇటువంటి ఘటనలు పెరిగిపోయాయని ఆరోపించారు. గుళ్లోకి మేము ఎందుకు రాకూడదని ప్రశ్నించిన పాపానికి, వారిని బూతులు తిడుతూ, కాళ్లతో తన్నుతూ, చివరకు పసిపాప చావుకు కారణమయ్యారంటే మనం ఎటువంటి సమాజంలో ఉన్నామో అర్థమవుతోందన్నారు. బాధితులు న్యాయస్థానాల్లో,

గోల్నాక లేబర్ అడ్డాలో నిరసన కార్యక్రమం చేపట్టిన సీఐటియూ నేతలు

చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని, పోలీస్‌స్టేషన్‌కు వెళితే, పోలీసులు కూడా బాధితులపైనే కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురి చేస్తూ, పెత్తందారుల పక్షాన నిలబడి, వారికి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోల్నాక నాయకులు సాయిలు, సహదేవు, రేణుక, శోభ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీర్ సావర్కర్ నిజమైన దేశ భక్తుడు : దాసి నాగరాజు

వీర్ సావర్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాగరాజు

నిజాంపేట్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త భారత స్వాతంత్ర్య ఉద్యమం లో పాల్గొన్న కొంతమంది నాయకులు సకల సౌకర్యాలు జైలులో అనుభవించిన సమయంలో అండమాన్ జైలులో 10 సంవత్సరాలు అత్యంత కఠిన కారాగార శిక్ష అనుభవించిన నిజమైన భారత స్వాతంత్ర సమరయోధుడు వినాయక దామోదర్ సావర్కర్ అని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. గురువారం వీర్ సావర్కర్ వర్ధంతి సందర్భంగా కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ దాసి నాగరాజు వీర్ సావర్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కమలాకర్, భవాని, సుధారాణి, సుహార్షిని, ప్రేమ్ సాయి, నిహారిక, మణికంఠ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా మంద మకరంద్

త్తాపూర్ ఫిబ్రవరి26, ప్రభాతవార్త : రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా మంద మకరందు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన అనురాగ్ జయంతి యాదాద్రి కలెక్టర్‌గా వెళ్లడంతో గురువారం రాజేంద్రనగర్‌లోని జోనల్ కార్యాలయంలో ఆయన మంద మకరందు బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయనకు రాజేంద్రనగర్ డీసీ సురేందర్ రెడ్డి, అత్తాపూర్ డీసీ సమ్మయ్యలు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ...విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.ప్రతి ఒక ఉద్యోగి భాధ్యతయు తంగా పని చేయాలని తెలిపారు.



ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గాంధీనగర్ ట్రాఫిక్ సిఐ వెంకట్‌రెడ్డి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ డి.వెంకట్‌రెడ్డి

ముషీరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గాంధీనగర్ ట్రాఫిక్ సిఐ డి.వెంకట్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందిరాపార్కు చౌరస్తాలో గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో వాహనదారులకు, ఫుట్‌పాత్ వ్యాపారులకు, పాదచారులకు అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మద్యం సేవించి, వాహనాలు నడపటం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితులలో వాహనాలు నడిపే అవకాశం ఇవ్వకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఏకాగ్రతతో వాహనాలు నడిపితే, రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని అన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ఇద్దరికి మించి ద్విచక్రవాహనాలపై ప్రయాణించకూడాదని, వాహనాలు నడిపేవారు అన్ని జాగ్రత్తలూ తీసుకుని, తోటి వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ట్రిబుల్ రైడింగ్ చేసినా, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా కారు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పెంటాగౌడ్, సిబ్బంది శివ, వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

నాగ్‌నాథ్ మాశెట్టికి సత్కారం

చార్మినార్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : పాతబస్తీ కోకరివాడి ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త,తెలంగాణ బసవ కేంద్రం అధ్యక్షులు నాగ్‌నాథ్ మాశెట్టి గత ఎన్నో ఏళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గురవారం జరిగిన కార్యక్రమంలో నాగ్‌నాథ్ మాశెట్టి,జగదేవి మాశెట్టి దంపతులను బాల్కీ హిరేమఠం పీఠాధిపతి మహాఘువ చక్రవర్తి శ్రీ గురు బసవ పట్టదేవరు ఘనంగా సత్కరించారు.ఈ కార్యమ్రంలో హిరేమఠం సంస్థాన్ కార్యదర్శి శ్రీ మహాలింగ స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

నిజాంపేట్ డంపింగ్ యార్డ్ సమస్యకు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణం : ఆకుల సతీష్

నిజాంపేట్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త నిజాంపేట్ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త సమస్యకు మున్సిపల్ అధికారుల నిరక్ష్య ధోరణే ప్రధాన కారణమని స్థానిక నాయకుడు ఆకుల సతీష్ ఆరోపించారు. సమస్య రోజు రోజుకు తీవ్రరూపం దాల్చి ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన సుమారు 2000 టన్నుల చెత్తను తక్షణమే తరలించేందుకు రోజుకు కనీసం 50 లారీలను వినియోగించాలని, రోజుకు కనీసం 200 టన్నుల చెత్త తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకుడు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్‌లో హిటాచీల సహాయంతో చెత్తను ఒక వైపుకు తరలించి, ప్రతిరోజూ వచ్చే ఆటోలు సులభంగా లోపలికి వెళ్లే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్య తీవ్రరూపం దాల్చడానికి కారణమైన డిప్యూటీ కమిషనర్‌పై విచారణ జరిపి తగిన చర్యలు

డంపింగ్ శాటిలైట్ ట్రాన్స్‌ఫర్ సెంటర్‌ను సందర్శించిన ఆకుల సతీష్

తీసుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు జగద్గిరిగుట్ట డంపింగ్ శాటిలైట్ ట్రాన్స్ ఫర్ సెంటర్‌ను సందర్శించినట్లు తెలిపారు. సమస్యల వివరాలు, సూచించిన పరిష్కారాలతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు.ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఈ సమస్యను అధికారులు అత్యవసరంగా పరిష్కరించాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.

వైభవంగా పంచముఖ ఆంజనేయ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో కుంభాభిషేకం

చిక్కడపల్లి ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నందు కొలువుదీరిన పంచముఖ ఆంజనేయ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం గురువారం ఆధ్యాత్మిక శోభతో పులకించింది. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పరివార సహిత శివాలయ నవగ్రహ పునఃప్రతిష్ఠా కుంభాభిషేక మహోత్సవాలు గురువారం ఆలయం ధర్మాధికారి కళా విఎస్ జనార్దన మూర్తి నేతృత్వంలో అత్యంత వైభవంగా ముగిశాయి. వేద మంత్రాల సాక్షిగా..ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఉదయం నుంచే ఆలయ ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్దన మూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా క్రతువులను నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ మహాపూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ప్రధాన ఘట్టాలైన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా విగ్రహాలకు ప్రాణకళను చేకూర్చే ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆగమశాస్త్ర విధివిధానాల ప్రకారం నిర్వహించారు. కుంభాభిషేకం ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన కుంభాభిషేకం, కలశాభిషేకం కార్యక్రమాల

ఆలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్న వేదపండితులు

ను కనులపండువగా జరిపారు. పవిత్ర జలాలతో కలశాలకు అభిషేకం చేస్తుండగా భక్తుల జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబైన అయ్యప్పస్వామి దేవాలయం



యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : బోరబండ ఎన్ఆర్ఆర్ పురం సైట్2లోని మల్లన్న స్వామి ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయ 18వ వార్షిక మహోత్సవాలు ఈ నెల 27 శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 4 గంటలకే శుప్రభాత సేవ, 5 గంటలకు శ్రీ లక్ష్మిగణపతి హోమం, 9 గంటలకు 108 కళశాలతో స్వరాభిషేకం, మ.12.30 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు దీపారాధన, సా.6.30 గంటల

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల దృశ్యం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

సిద్దిపేట పట్టణంలోని పారుపల్లి వీధిలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి పాత దేవస్థానంలో గురువారం 56వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రెండవరోజు పూజాకార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడ్డాయి. ఉదయం యాగశాలప్రవేశంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శాంతిహోమం నిర్వహించారు. తదుపరి శ్రీభూదేవి, నీలాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివార్లకు అష్టోత్తర శత కలశాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ, శ్రీవేంకటేశ్వర స్వామి సేవాసమితి సభ్యులు, ఆలయ మహిళా గోష్టి సభ్యులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్చి 3న ఏడుపాయల దుర్గమ్మ ఆలయం బంద్

పాపన్నపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని మార్చి 3 మంగళవారం ఏడుపాయల దుర్గమ్మ ఆలయం మూసివేస్తామని ఇఓ వీరేశం తెలిపారు. ఉదయం 6 గంటలనుండి సాయంత్రంవరకు అమ్మవారి దర్శనం ఉండదని భక్తులకు సూచించారు. ఆలయశుద్ధి సంప్రోక్షణ అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజల అనంతరం తిరిగి బుధవారం ఉదయం దుర్గమ్మదర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు.

సైంటిఫిక్ మోడల్ ఎగ్జిబిషన్లో న్యాయనిర్ణేతగాఎంపికైన వెంకటరమణ

-రాష్ట్రపతి నిలయంలో సైన్స్ వేడుకలకు కొడుపాక్ టీచర్

పాపన్నపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

ఈ నెల 27న హైద్రాబాద్లోని రాష్ట్రపతి నిలయంలో జరిగే సైన్స్ డే వేడుకలకు పాపన్నపేట మండలం కొడుపాక ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ టీచర్ వెంకటరమణ హజారు కానున్నారు.రెండు రోజుల పాటు అక్కడ నిర్వహించనున్న ఖిసైంటిఫిక్ మోడల్ ఎగ్జిబిషన్ఖి పోటీల్లో న్యాయ నిర్ణేతగా పాల్గొనేందుకు ఆయనకు అవకాశం వచ్చినట్లు తెలిపారు.యువ శాస్త్ర వేత్తల ప్రతిభను అంచనా వేసే అవకాశం తనకు దొరకడం అదృష్టమన్నారు.

సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్, వైస్‌చైర్మన్‌ల పదవీబాధ్యతల స్వీకరణ

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త:

నూతనంగా ఎన్నికైన సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మరియు వైస్ చైర్మన్‌లు గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్పర్సన్ కూన వనిత, వైస్ చైర్మన్ గా ఆఫేస్ షఫీ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, కౌన్సిలర్లు హాజరయ్యారు. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ల కు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శాలువాలు, పూల బోకెలతో ఘనంగా సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోఆపరేటివ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

సంగారెడ్డి జిల్లా తెలంగాణ కోఆపరేటివ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమానికి టీఎన్జీఎస్ అధ్యక్షులు ఎండి జావేద్ అలీ , కార్యదర్శి రవి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీఎస్ అసోసియేట్ అధ్యక్షులు వెంకటరెడ్డి. కసిని శ్రీకాంత్, కోశాధికారి శ్రీనివాస్, నిర్మల రాజకుమారి, ఆంజనేయులు శ్రీనివాస్ శ్రీధర్ శివలింగ ప్రసాద్ పుష్పలత నిర్మల శ్రీవాణి స్వప్న, సంగారెడ్డి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశం యాదవ్ రెడ్డి సహకార శాఖ అధికారులు, పాల్గొన్నారు.

ప్రపంచదేశాలపై అమెరికా సామ్రాజ్యవాద దాడి

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

ప్రపంచ దేశాలపై అమెరికన్ సామ్రాజ్యవాద దాడి పెరుగుతుందని, అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలను మోడీ ప్రభుత్వం తాకట్టు పెడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి కేవల్ కిషన్ భవన్ లో సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ కార్మిక, కర్షకుల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. అమెరికాతో చేసుకుంటున్న ట్రేడ్ ఒప్పందాల వివరాలను ఇప్పటివరకు పార్లమెంట్‌కు గానీ, దేశ ప్రజలకు గానీ తెలియజేయలేదని విమర్శించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, నాయకులు నాగేశ్వర్‌రావు, మహిపాల్, లలిత, యాదగిరి, కృష్ణ, విద్యాసాగర్, పాండు రంగారెడ్డి, వాజిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్

సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

ఏఐటీయూసీ సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎంఏ. రెహమాన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు . ఈ సమావేశానికి ఏఐటియుకి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ హాజరై మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920 వ సంవత్సరం లో ఆవిర్భావించిన తర్వాత నే కార్మిక చట్టాలు వచ్చాయనీ, గుర్తు చేశారు. కార్మికులకు చట్టాలు కావాలని పోరాటాలు నిర్వహిస్తుంటే, కేంద్రంలో ని నరేంద్ర మోడీ ప్రభుత్వం, 44కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు వ్యతిరేకంగా వ్యాపారస్తులకు అనుకూలంగా 4లేబర్ కోడ్ లను తెచ్చారని ఆరోపించారు. .ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి బి.వెంకటరాజ్యం, చిరంజీవి, లింగమయ్య, లక్షి మ్మ, శంకరాప్ప, శివశంకర్, విజిత, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనశాఖలో అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి: టిపీటీఫ్

సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :

గిరిజన సంక్షేమ శాఖలో ద్వితీయ శ్రేణి భాషా పండితులను, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను ఉన్నతీకరించాలి మరియు గిరిజన సంక్షేమ పాఠశాలల, ఉపాధ్యాయుల, విద్యార్థుల దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ రెండవ దశ పోరాటంలో భాగంగా టి పి టి ఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అని అందజేశారు. పరిపాలనాధికారి(ఏ ఓ) అంథోని డైయోనిసియోకు డిమాండ్లతో కూడిన మెమోరాండం సమర్పించారు.

పెన్షన్ పెంపు, బడ్జెట్లో నిధుల కేటాయింపు పెంపు కోసం ఉద్యమం..

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

వికలాంగుల పెన్షన్ పెంపు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధుల కేటాయింపులు పెంపుకోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఎన్.పి.ఆర్.డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య హెచ్చరించారు. ఎన్‌పిఆర్‌డి 16వ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం సంగారెడ్డి పట్టణంలోని గణేష్‌నగర్‌లో అధ్యక్షులు యం బస్వరాజు జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యం బస్వరాజు, కార్యదర్శి కొనింటి నర్సిములు,జిల్లా ఉపాధ్యక్షులు జయలక్షి మ్మ, పి మేరీ, రాంచంద్రర్, వెంకయ్య, రాములు, రాజు కుమార్, జిల్లా కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

-తోషిబా యాజమాన్యాన్ని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

పటాన్‌చెరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు సిఎస్ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తోషిబా యాజమాన్యాన్ని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారంలోగల తోషిబా పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గపరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులకు పరిశ్రమ యాజమాన్యం సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ప్రధానంగా ఇటీవల పటాన్‌చెరు నియోజకవర్గానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడం జరిగిందని, శాశ్వత ప్రాతిపదికన అమీన్‌పూర్ పరిధిలోని సర్వే నెంబర్ 993లో కళాశాలభవనం, హాస్టల్ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. నిధులకొరత మూలంగా భవన నిర్మాణ పనులు ముందుకు కొనసాగడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కళాశాల, హాస్టల్ భవన నిర్మాణాల కోసం రూ.45కోట్ల 70లక్షలతో ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలను రూపొందించడం జరిగిందని వారి దృష్టికి తీసుకెళ్లారు.

పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పరిశ్రమ సిఎస్ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములుకావాలని ఆయన పరిశ్రమ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లో పరిధిలో పారిశుధ్య నిర్వహణలో కీలకమైన వాహనాల కొనుగోళ్లకు సైతం సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులు అతిత్వరలో యాజమాన్యంతో చర్చించి సిఎస్ఆర్ నిధులు కేటాయించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈసమావేశంలో పరిశ్రమ సిఎండి హిరోషి ఫురుట, డైరెక్టర్ మానవ వనరుల విభాగం కట్టుతోషి మారుమోతో, హెచ్ఆర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతం

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్ల పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్‌రామ్ తెలిపారు. మొత్తం 15,515మంది విద్యార్థులకుగాను 15, 209మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 14,296 మంది, వృత్తి (వొకేషనల్) కోర్సుకు చెందిన 913 మంది విద్యార్థులు హాజరైనారని తెలిపారు. మొత్తం 306మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, అందులో జనరల్ కోర్సుకు చెందిన 259మంది, వృత్తి కోర్సుకు చెందిన 47మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం హాజరు శాతం 98.03గా నమోదైందని, ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు కన్వీనర్/డిఐఈఓ 2 పరీక్ష కేంద్రాలను, డిఈసి సభ్యులు 11కేంద్రాలను, హెచ్‌పిసి సభ్యులు 5కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్లు 14కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్లు 8కేంద్రాలను తనిఖీ చేసినట్లు గోవింద్‌రామ్ తెలిపారు.

అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జా

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అమీన్‌పూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:

అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతూ మాజీ వైస్ ఎంపీపీ కోకల శ్రీనివాస్ నేతృత్వంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అధికారులు సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. బీరంగూడలోని ప్రసిద్ధ శంభునిగుడి సమీపంలోని సర్వే నంబర్ 783లో సుమారు 20 గుంటలు, అలాగే సర్వే నంబర్ 767లో సుమారు 3 గుంటల ప్రభుత్వ భూమి ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే అక్కడ ఆక్రమణలు బహిరంగంగా కనిపిస్తున్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భూమిని కాపాడకపోతే భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాల కోసం, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు స్థలం కొరత ఏర్పడుతుందని వినతిపత్రంలో వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సర్వే అధికారులతో సదరు సర్వే నంబర్లలో సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ భూమికి స్పష్టమైన హద్దులను ఏర్పాటు చేయాలని, అక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ వార్డు సభ్యులు సిహెచ్ లింగం గౌడ్, పట్లోళ్ల భాస్కర్ రెడ్డి, అమీన్ పూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గీతంలో ప్రమాణ కోసం సర్వం సిద్ధం

-ప్రతిభ, అనుభవపూర్వక అభ్యాసంతో అబ్బురపరచనున్న వార్షిక వేడుక

పటాన్‌చెరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

వార్షిక ఉత్సవం ప్రమాణ 2026ను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించనుంది. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ మార్గదర్శనంలో స్టూడెంట్ ఆర్గనైజింగ్, లీడర్ షిప్ కమిటీ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంది. ముందస్తు వేడుకలతో ఈ యేడాది ప్రమాణ ఆరంభమైంది. ఇందులో నృత్య, పాటల పోటీలు, ఆటో ఎక్స్ పో, ముఖాముఖి చర్చలను ఈనెల 24నుంచి 26వతేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్లు అన్నింటిలో హైదరాబాద్ ప్రాంగణ అధికార మస్కట్ రోరోను ప్రదర్శిస్తున్నారు.

ఘనంగా ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్

-కౌన్సిలర్లను సన్మానిస్తున్న సూపర్వైజర్ శ్రీలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు

కౌన్సిలర్లను సన్మానిస్తున్న సూపర్వైజర్ శ్రీలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు

గజ్వేల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల ఐదు అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఎర్లీ చైల్డ్ హుడ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్ (పూర్వ ప్రాథమిక విద్య) కార్యక్రమాన్ని 3వ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రజ్ఞాపూర్‌లోని 3వ అంగన్వాడీ కేంద్రంలో ఇటీవల మున్సిపాలిటీ కౌన్సిలర్లుగా నూతనంగా ఎన్నికైన రొట్టెల శ్రీనివాస్, మన్నె రూప వెంకటేష్, బొగ్గుల స్వప్న సురేష్‌లను అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీలక్ష్మి, అంగన్వాడీటీచర్లు శాలువాలతో ఘనంగాసన్మానించారు. అనంతరం అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేయడంతోపాటు గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీటీచర్లు రామలక్ష్మి, రజిత, నాగరాణి, ఫర్జానాతోపాటు చిన్నారులతల్లులు పాల్గొన్నారు.

ధనసిరిలో స్వయం పరిపాలన దినోత్సవం

జహీరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

మొగడంపల్లి మండలపరిధిలోని ధనసిరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కలెక్టర్‌గా అనూష, డిఈఓగా అగస్టీన్, ఎంఈఓగా బాలరాజ్, ప్రధానోపాధ్యాయులుగా నిఖిత, ఉపాధ్యాయులుగా విద్యార్థులు విధులునిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారిన ఒకరోజు ఉపాధ్యాయులు తమ తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయులుగా ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

జిన్నారం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రజలందరూ తిరిగి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని జంగంపేట చెందిన కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కుమ్మరి రాంబాబు గురువారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల కృషితో నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ జెండా ఎగర వేసామని అన్నారు. ప్రతి మున్సిపాలిటీనీ అభివృద్ధి పథంలో తీసుకొని పోవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, రాజేష్, గంగారెడ్డి, శంకర్, శ్రీకాంత్ గౌడ్, వెంకట్ రెడ్డి, మధు, దుర్గేశ్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ రావు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

జాడ లేని సొత్తు .. జమ కాని సొమ్ము..

అక్రమ వసూళ్లలో అధికారులంతా బాధ్యులే....

రికార్డులు లేవు..నిబంధనలు కానరావు..

5 ఏళ్ల తైబజార్ నిధులు ఏమయ్యాయి..

పాపన్నపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

ఉద్యోగి తప్పుచేస్తే చర్యలు తీసుకోవాల్సిన జిల్లా అధికారే తప్పులు చేయాలని ఆదేశిస్తున్నారు. తమదికాని స్థలంలో తైబజార్ వసూలు చేయించారు. ఆపై ఒకడుగు ముందుకేసి వనదుర్గమ్మ పేరిట దొంగరశీదు బుక్కులు ముద్రించి, అందిన కాడికి తైబజార్ వసూలు చేశారు. ఏడుపాయల జాతర జరిగి 9 రోజులు అవుతున్నా, సొమ్ములు బ్యాంకులో జమ చేయలేదు. తలా పాపం తిల పిడికెడు అన్న చందంగా జిల్లా అధికారి, కార్యదర్శులు పంపకాలు చేసుకునేందుకు యత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడుపాయల జాతరలో నాగ్సాన్ పల్లి గ్రామ పంచాయతీ అధికారులు గత ఐదేళ్లుగా ఇలా తైబజరు పన్ను వసూలు చేశారని తెలిసిందే. అయితే గత ఐదేళ్లుగా ఈ తంతు సాగుతున్న గ్రామ పంచాయతీ ఇర్సాల్ నామలో నమోదు లేదు చలన కట్టలేదు పంచాయతీకి చెందలేదు కానీ గత ఐదేళ్ళుగా వసూలు చేసిన డబ్బులు ఏమయ్యాయో అనేది చర్చనీయాంశంగా మారింది.

సామాన్యులకే శిక్ష...

ఓ శాఖ పేరును ఉపయోగించి సామాన్యులు రసీదు అచ్చువేయించి పన్నులు వసూలు చేస్తే ఆ శాఖ అధికారులు రాద్దాంతం చేస్తూ చీటింగ్ కేసులు, శాఖ పరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా సొమ్మును రికవరీ చేస్తారు. అలాంటిది గత ఐదేళ్లుగా దేవాదాయ ధర్మాదాయశాఖ పేరున పంచాయతీ పన్ను వసూలుచేస్తూ తప్పుదోవ పట్టించడమే కాకుండా వసూలు సొమ్ములను పంచాయతీకి జమాబంది చేయకపోవడం రికార్డులు లేకుండా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఏది ఏమైనా దేవాదాయ ధర్మాదాయశాఖ ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటారో లేక రక్షిస్తారో వేచిచూడాల్సిందే

వార్డులలో పర్యటించిన కమిషనర్

మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న నాయిని యాదగిరి

గజ్వేల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ స్థానిక కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సత్యలక్ష్మి యాదగిరి మాట్లాడుతూ వార్డులో ప్రధానంగా పాత ఎంపిపి భవనం చుట్టూ ఉన్న ప్రహారీగోడ ప్రమాదకరంగా ఉందని దానిని తొలగించాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సిసి రోడ్ల నిర్మాణం, పారిశుధ్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, కాంగ్రెస్ నాయకులు నేత నాగరాజు, పరుచూరి రాజు, విట్టల్ తదితరులు ఉన్నారు.

గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా

-నూతన పాలకవర్గాన్ని సన్మానించిన పతాని రామకృష్ణాగౌడ్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

మిట్టపల్లి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకునేందుకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని టిఎఫ్‌సిసి చైర్మన్ పతాని రామకృష్ణాగౌడ్ పేర్కొన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచ్ చింతల శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు వార్డు సభ్యులను, పారిశుధ్య కార్మికులను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతల శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి రామకృష్ణాగౌడ్ మాట్లాడుతూ గతంలో మిట్టపల్లి గ్రామ సర్పంచ్‌గా, పిఏసిఎస్ చైర్మన్‌గా పనిచేశానని, అప్పుడు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని తెలిపారు. నేడు ఎన్నికైన పాలకవర్గం అంతా యువతరానికి చెందిన వారు కావున మీకు భవిష్యత్తు ఉందని, గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, నా తనయుడు డాక్టర్ రాకేష్ సేవలు కూడా గ్రామానికి అందుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పయ్యావుల రాములు, నాయకులు కిషన్, జెపి.యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

పాపన్నపేట, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త:

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవనీ ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు.జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, గురువారం సాయంత్రం నార్సింగి ప్రధాన చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్‌లైసెన్స్‌తోపాటు సరైనపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కల్పించారు.కానిస్టేబుళ్లు ప్రవీణ్, వెంకటేష్, తదితరులున్నారు.

రోడ్డుప్రమాదాలు విధిరాత కాదు-నిర్లక్ష్యఫలితం

-జిల్లా ఎస్‌పి డి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్

గెలుపొందిన వారికి హెల్మెట్లను బహుమతులుగా అందజేసిన జిల్లా ఎస్‌పి డి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్ తదితరులు

నర్సాపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదాలు విధి రాత కాదని, మన నిర్లక్ష్య ఫలితమేనని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్ స్పష్టంచేశారు. రోడ్డు ప్రమాదాల్లో ఎవ్వరూ ప్రాణాలు కోల్పోకుండా సురక్షితంగా గమ్యం చేరడమే లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన అరైవ్ ఆలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మెదక్ జిల్లా లోని నర్సాపూర్ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో బీవీ

శ్రీగురుపీఠంలో ప్రత్యేకపూజలు

సాయిబాబాకు హారతి ఇస్తున్న దృశ్యం

శివంపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండలపరిధిలోని గూడురుగ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగురు పీఠంలో గురువారం ఫాల్గుణ శుద్ధనవమిని పురస్కరించుకొని శ్రీసాయి బాబా, శ్రీదత్తాత్రేయ మహాస్వాములకు శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచి స్వరాజ్యలక్ష్మీశ్రీనివాస్‌గౌడ్, సూర్యం కుమార్‌గౌడ్, రాజ్యం భిక్షపతి తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

మనోహరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండలంలోని కాళ్లకల్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ తెలిపారు. జిల్లా విద్యాధికారిగా శ్రీవాణి, మండల విద్యాధికారిగా అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయులుగా జగన్ ఉపాధ్యాయులుగా షాలు, స్నజన, సంజన మొదలగువారు వ్యవహరించారు. స్వయంపరిపాలన దినోత్సవంలో తమతమ అనుభవాలను, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మమతానాగిరెడ్డి, నరసింగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేట పురపాలిక కౌన్సిల్ సమావేశం

–చైర్మన్ అంజమ్మ అధ్యక్షతన చర్చకు రానున్న పలు అంశాలు

కౌన్సిల్ సమావేశంలో పాల్గొననున్న మహిళాకౌన్సిలర్లు

సదాశివపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
సదాశివపేట మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నుకోబడిన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, మొదటిసారిగా కౌన్సిల్ సమావేశ మందిరంలో సాధారణ సమావేశం ఏర్పాటుకు అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. సంవత్సరకాలంగా పాలకవర్గం లేకపోవడంతో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే రంజాన్‌మాసం ప్రారంభమైనందున ఈద్గాలవద్ద కావలసిన ఏర్పాట్ల గురించి, నూతనంగా చేపట్టవలసిన సిసిరోడ్లు, డ్రైనేజీలు, బోర్లు, ఎలక్ట్రికల్‌లకు సంబంధించిన పనుల గురించి ఎజెండాలో చూపినవిధంగా చర్చించనున్నారు. స్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షణలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు కౌన్సిల్‌లో ప్రవేశపెట్టనున్నారు. కౌన్సిల్‌లో ఉన్న 26 మంది సభ్యులలో చాలావరకు కొత్తసభ్యులు ఉన్నారు. ఎజెండాలోని అంశాల గురించి వారికి ఎంతవరకు అవగాహన ఉందో చూడాలి.

మార్కండేయ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
జిల్లాకేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో గురువారం పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షులు కాముని రాజేశం ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ దూసకంటి సత్యనారాయణ శర్మ, బ్రహ్మశ్రీ ఆదరాసుపల్లి శివరామకృష్ణశర్మ, సద్గురు సదానంద, సకినాల కృష్ణమూర్తి, మలిపెద్ది నాగేందర్‌కుమార్‌ల ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తివచనము, అంకురార్పణం, అఖండ దీపస్థాపన, కలశస్థాపన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషపూజ, హారతి మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అశోక్, శ్రీహరి, ప్రధానకార్యదర్శి బాల్‌రాజు, సహాయ కార్యదర్శులు గుండు రవితేజ(లడ్డు), అంజనేయులు, కోశాధికారి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ప్రకాష్, మహేష్, రాజ్‌కోటి, రాజేంద్రప్రసాద్, సంతోష్ కుమార్, జలజ, సునీత, పుట్ట సునీత, యువజన సంఘం, మహిళా సంఘం తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అధికారుల సమావేశం

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సమావేశంలో పాల్గొన్న అధికారులు

అల్లాదుర్గం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం మండలస్థాయి కన్వర్జెన్సీ కో-ఆర్డినేటర్ కమిటీ సమావేశం పిహెచ్‌సి డాక్టర్ సారిక అధ్యక్షతన అంతర్‌శాఖల (సాంఘికసంక్షేమం, విద్యాశాఖ, రెవిన్యూశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆరోగ్యబోధకులు, వసతి గృహం వార్డెన్‌లు, ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వైద్య,ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞాపూర్‌లో ఘనంగా బోనాలు

గజ్వేల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
గత రెండురోజుల నుండి ప్రజ్ఞాపూర్‌లోని త్రిశక్తి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రథమవార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రధాన వీధుల గుండా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి త్రిశక్తి ఆలయంలోని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ముదిరాజ్‌సంఘం నాయకులు కలిసికట్టుగా పనిచేస్తూ రెండురోజులపాటు వార్షికోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

–వార్డ్ మెంబర్ల గైర్హాజరుకు అధికారులే కారణం!
–10మంది హాజరు 100మంది గైరాజర్

కొండాపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
కొండాపూర్ మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల వార్డ్ మెంబర్‌షిప్ శిక్షణ కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యానికి, అవ్యవస్థకు అద్దం పడుతోంది. శిక్షణ పేరుతో నిర్వహిస్తున్న ఈకార్యక్రమం పూర్తిగా దిక్కుతెలియని స్థితికి చేరింది. సరైన సమాచారం లేకపోవడం, ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం, సమయపాలన లోపించడం వంటి కారణాలతో వార్డ్ మెంబర్లు పెద్దసంఖ్యలో గైర్హాజరయ్యారు. దీనికి పూర్తిబాధ్యత అధికారులదేనని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. శిక్షణ పేరుతో కేవలం బిల్లులువేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి, మీటింగ్ ఉందని, ఫైల్‌పని ఉందని, పై అధికారుల ఆదేశాలున్నాయని ఏదో ఒక సాకుచెప్పి బాధ్యతల నుంచి తప్పించుకోవడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధి కోసం, ప్రజల సేవ కోసం పనిచేయాల్సిన అధికారులు తమ స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి నిర్లక్ష్యధోరణి కొనసాగితే ప్రజాగ్రహం ఉప్పొంగక తప్పదని హెచ్చరించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని గౌరవప్రదంగా, ప్రయోజనకరంగా నిర్వహించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

సభ్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన సిఐ

అల్లాదుర్గం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన అల్లాదుర్గంలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సిఐ రేణుకరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ రేణుకరెడ్డి పోలీసు సిబ్బందికి, ఎగ్జామినేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా సాగేలా చూడాలని బాధ్యులను ఆదేశిస్తూ ప్రజలు తమవంతు సహకారం అందించాలని వివరించారు. పరీక్షాకేంద్రం పరిసరాల్లో జిరాక్సు దుకాణాలు మూసి ఉండేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని సూచించారు.

యాప్‌లో కాదు.. షాప్‌లో యూరియా ఇవ్వాలి!

–యూరియా కొరతతో రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

చిన్నకోడూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
చిన్నకోడూర్ మండల కేంద్రంలో యూరియా కొరతపై గురువారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతోకలిసి యూరియాకేంద్రాలను సందర్శించిన సందర్భంగా బిఆర్ఎస్ మండలాధ్యక్షులు కాముని శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందించకుండా యాప్‌లద్వారా బుకింగ్ విధానం పెట్టి రైతులను అవస్థలకు గురిచేస్తోందని విమర్శించారు. రైతులందరూ ఓటిపి సమస్యలవల్ల యాప్‌లో యూరియా బుక్‌చేయలేక గంటల తరబడి షాపులవద్ద నిరీక్షించాల్సివస్తోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. యాప్‌విధానాన్ని వెంటనే రద్దుచేసి, గ్రామాలవారీగా షాపులద్వారా యూరియా అందించాలని డిమాండ్‌చేశారు. యూరియా సమస్యను వెంటనే పరిష్కరించి, రైతుభరోసా నిధులను ఒకటి రెండు రోజుల్లో రైతులఖాతాల్లో జమ చేయాలని డిమాండ్‌చేశారు. లేకపోతే బిఆర్ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కీసరి పాపయ్య, రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్, సర్పంచి నాగార్జునరెడ్డి, నాయకులు రాచకొండ భిక్షపతి, మన్నె రాములు, గొల్లపల్లి రాజశేఖర్‌రెడ్డి, మన్నె ఆనంద్, ఎలుక నవీన్, రైతులు పాల్గొన్నారు.

మహిళాశక్తి భవనానికి భూమిపూజ

మహిళాశక్తి భవనానికి భూమిపూజ చేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

సదాశివపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
గురువారం మాచిరెడ్డిపల్లి గ్రామంలో మహిళాశక్తి ద్వాక్రాభవనం పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి సిడిసి చైర్మన్ గడిల రామ్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచి మోహన్‌గౌడ్, ఉపసర్పంచి కిష్టమ్మ, వార్డుమెంబర్లు మండల సర్పంచి ఫోరం అధ్యక్షులు ఒగ్గు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, కంబాలపల్లి సర్పంచి బాబు, ఇస్రితాబాద్ సర్పంచి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచి అమృతమ్మ, ఎపిఎం శ్రీనివాసరావు, మాజీసర్పంచి సుధాకర్, కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు సురేష్‌గౌడ్, ఇందిరమ్మకమిటీ సభ్యులు జగన్, జమీల్ మహిళా సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, యువజననాయకులు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు

ఎంపికైన మెదక్ జల్లా వాలీబాల్ క్రీడాకారులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
వెస్ట్‌బెంగాల్‌రాష్ట్రంలో ఫిబ్రవరి 24నుండి ఒకటి మార్చివరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడిమెదక్‌జిల్లా నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. బాలుర విభాగంలో డి.మనోజ్‌కుమార్, బాలికల విభాగంలో పి. జయసిని, బి.అక్షిత, జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ ఎంపికలు రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు కనబరిచిన అద్భుత ప్రదర్శన, క్రమశిక్షణతో ఉమ్మడిమెదక్‌జిల్లా వాలీబాల్ అధ్యక్షులు పరంజ్యోతి, ఆర్.వెంకటేశ్వర్లు, పాల సాయిరాం, కార్యదర్శులు కె. రవీందర్, ఎ.కృష్ణ, కె.రవీందర్‌రెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడిమెదక్‌జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయిలో సత్తాచాటి మంచిఫలితాలు సాధించి జిల్లాకు, తెలంగాణరాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

చౌటకూరు ఫ్లైఓవర్ పరిశీలన

చౌటకూరు ఫ్లైఓవర్ వెంతెనను పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ఏఐ ఇంజనీర్లు

చౌటకూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన చౌటకూరు వద్ద 161వ జాతీయ రహదారిపై నిర్మించిన వంతెనను ఎన్‌హెచ్ఏఐ ఇంజనీర్ల బృందం బుధవారం పరిశీలించారు. ఫ్లైఓవర్‌పై ఇరువైపుల హైమాస్, ఎల్ఈడి లైట్లు అమర్చాలని కోరుతూ సర్పంచి పార్కల రాంరెడ్డి, వార్డుసభ్యులు ఇటీవల గజ్వేల్లోని ఎన్‌హెచ్ఐ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవికి వినతిపత్రం అందించగా, స్పందించిన మాధవి ఫ్లైఓవర్‌ను పరిశీలించి నివేదిక ఇవ్వాలంటూ ఇండిపెండెంట్ ఇంజనీర్ల బృందానికి సూచించగా రెసిడెంట్ ఇంజనీర్ ఎంజీ భాషా ఆధ్వర్యంలో ఇంజనీర్ల బృందం ఫ్లైఓవర్ ఇరువైపులగల సర్వీసు రహదారులను ఉన్నతాధికారులు నివేదిక అందచేసేందుకు తగు పరిశీలనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి పార్కల రాంరెడ్డి, మాజీ ఉపసర్పంచి కలాలి రామాగౌడ్, నాయకులు వర్కల రమేష్, పార్కల ప్రభాకర్‌రెడ్డి, పల్నాటి మల్లికార్జున్‌గౌడ్, గోరేమియా, దమ్మీ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఈజిఎస్ పనులు వేగవంతం చేయాలి

–ఎంపిడివో క్రాంతికుమార్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:
ఈజిఎస్ పనులు మరింత వేగవంతం చేయాలని ఎంపిడివో క్రాంతికుమార్ సూచించారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షాసమావేశంలో మాట్లాడారు. పన్నువసూళ్లను పెంచి, 15వ ఆర్థికసంఘం నిధులను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనుల ద్వారా గ్రామీణ లకు ఉపాధి కల్పించడంతోపాటు అభివృద్ధి పనులు కూడా వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వలక్ష్యాలను సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఓ జాకీర్ అలీ, ఈసి నవాజ్ పాల్గొన్నారు.

సిద్దిపేట రెవెన్యూశాఖపై హరీష్‌రావు దుమారం

–ఎమ్మార్వో కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ
–కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు

మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి
సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు గురువారం ఆకస్మికంగా సందర్శించి అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పాస్‌బుక్‌లు, సాదాబైనమా దరఖాస్తులు, కుటుంబసభ్యుల ధృవీకరణపత్రాలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విన్నారు. అనంతరం మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో రిజిస్ట్రేషన్ పూర్తయిన వారం రోజుల్లోనే పాస్‌బుక్‌లు అందేవని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పేరుతో వ్యవస్థ మార్చిన తర్వాత రిజిస్ట్రేషన్ అయి ఆరునెలలు గడిచినా పాస్‌బుక్‌లు అందడం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌ప్రభుత్వం సాదాబైనమా ప్రక్రియను పూర్తిగా నిలిపివేసిందని ఆరోపించారు. సిద్దిపేటలోనే 1200మంది సాదాబైనమా కోసం దరఖాస్తు చేసుకున్నా స్పందన లేదన్నారు.

9లక్షల దరఖాస్తులు.. ప్రభుత్వం మొండి వైఖరి!
రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో 9లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, కాని ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోవడంలో విఫలమైందని అన్నారు. స్లాట్ రద్దుచేసినవారికి రెండున్నరేళ్లు గడిచినా డబ్బులు తిరిగి ఇవ్వలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో నిషేధిత భూముల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, నిషేధిత భూముల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట రెవెన్యూ అధికారులు ఎసిబికి చిక్కుతున్నారని, ఇది శాఖలో అవినీతి పెరిగిందని సూచిస్తోందన్నారు.

సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో అనేక సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు. కుటుంబసభ్యుల ధృవీకరణపత్రాల జారీ విషయంలో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. విఆర్ఏ కుటుంబ సభ్యులను వెంటనే క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసందర్భంగా కార్యాలయానికి వచ్చిన పలువురు ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే హరీష్‌రావు దృష్టికి తీసుకువచ్చారు.

వివాహ వేడుకల్లో పిసిసి సభ్యులు కె.శ్రీనివాస్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
నారాయణఖేడ్‌మున్సిపల్‌కుచెందిన గౌలి మేఘరా కుమారుడి వివాహం నాదేడ్‌లో జరిగిన వివాహ వేడుకల్లో పిసిసి సభ్యులు కె.శ్రీనివాస్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాండు, మదన్, రజినీకాంత్, సాయిచరణ్, నీలేష్, కొండల్‌రెడ్డి, సంజీవ్, విర్‌రెడ్డిలున్నారు.

ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశంలో యువనేత సాగర్‌శెట్కార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ మండల్ నేమ్లిమెంట్ గ్రామానికి చెందిన పులగరి సాయమ్మ అంజయ్య ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో యువనేత సాగర్‌శెట్కార్ పాల్గొని కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి టింకటి సాయిలు, ఉపసర్పంచి కిరణ్‌కుమార్, నరసింహారెడ్డి, సోఫీ, కిరణ్‌కుమార్ గ్రామ పెద్దలు, కార్యకర్తలు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

గోవిందపూర్ శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన



శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నేతలు

జహీరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
మండలపరిధిలోని గోవిందపూర్‌లోని శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన పూజాకార్యక్రమాలు నేత్రపర్వంగా కొనసాగాయి. విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం, గ్రామసర్పంచి జి.వెంకట్, మాజీసర్పంచులు శంకర్, జి.నర్సింలు, బి. చెంద్రయ్య, ఎన్.భూమ్‌రెడ్డి, వీర్‌శెట్టి, చెంగల్ జైపాల్, విశ్వనాథ్, జి. రాజు, పి.నారాయణ, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్.రాజు ఎ.నర్సింలు, జి. అంజన్న, మారుతి, జి.రాములు, జి.రాజు, ఎ.జగన్, శ్రీనివాస్, హన్మంతు, ఎస్.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రజకులపై దాడికి నిరసనగా ధర్నా

రజకులపై దాడికి నిరసనగా ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పుల్‌కల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రజకులపై దాడిచేసి రెండునెలల పాపమృతికి కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని బిసి, ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రమైన పుల్‌కల్‌లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మ్యాతరి బాలరాజ్, రజకసంఘం మండల అధ్యక్షులు, కార్యదర్శులు వెంకటేశం, దత్తు, నాయకులు ఎర్రోళ్ల పోచయ్య, ఇందూరరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ గౌసియా హుస్సేన్ ఘన సత్కారం

గౌసియా హుస్సేన్ దంపతులను సన్మానిస్తున్న మద్ది ప్రతాపరెడ్డి

గుమ్మడిదల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ గౌసియా హుస్సేన్ కౌన్సిలర్‌గా గెలుపొందిన అనంతరం కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి ఆహ్వానం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు. కులమతాల గోడలు కూల్చి, భక్తి మార్గంలో అందరూ ఒక్కటిగా నిలవడం గుమ్మడిదల ప్రాంతానికి గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు, మహిళలు, యువత, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఘనంగా ఫేర్వెల్

–ముఖ్య అతిథిగా హాజరైన ఆలయకమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి

ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 9వ, 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ పార్టీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీరభద్రస్వామి ఆలయకమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. అనంతరం విద్యార్థులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి తమ ప్రేమాభిమానాలను వ్యక్తంచేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, పాటలు కార్యక్రమానికి మరింతశోభను చేకూర్చాయి. ఆనందోత్సాహాలతో నిండిన ఈ ఫేర్వెల్ వేడుక విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల హృదయాల్లో చెరగని ముద్రవేసింది.

తెలంగాణ అమరవీరుడికి నాయకుల నివాళి

జహీరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:
తెలంగాణ అమరవీరుడు లక్ష్మణ్‌యాదవ్ 16వవర్ధంతిని పురస్కరించుకుని మండలపరిధిలోని హోతి(బి) గ్రామంలో గురువారం సిరిసిగా లక్ష్మణ్‌యాదవ్ సమాధివద్ద ఆయాపార్టీల నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వేరు వేరుగా పాల్గొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిసిగా కుటుంబసభ్యులు జగన్, శ్రీనివాస్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, బిఆర్ఎస్‌నాయకులు పెంటారెడ్డి తట్టు నారాయణ, వెంకటేశం, నర్సింహాగౌడ్, సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, భీంరావ్ శ్రీనివాస్, అరుణ్‌కుమార్, మాజీసర్పంచులు జగదీశ్, చిన్నరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రుణ్‌రాజ్, అమీత్‌కుమార్, హీరు రాథోడ్, పర్వేజ్‌పటేల్, నాగలక్ష్మి, విష్ణు, ప్రసాద్, రవి, మహమూద్, ప్రభు, ఖలీల్, సాలోమన్, కుమార్, రాజేందర్, చింటూ, రాజు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పి. నరసింహారెడ్డి, మాజీవైస్ఎంపిపి వి.రాములు, సిడిసిడైరెక్టర్ మల్లారెడ్డి, మల్చల్మె సొసైటీ వైస్‌చైర్మన్ ఇమామ్‌పటేల్, కాంగ్రెస్‌నాయకులు లక్ష్మారెడ్డి, వాజిద్‌పటేల్, సురేష్, రాజు, జాకీర్‌పటేల్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.